# జేసీ, జగనే ముద్దాయిలు

**నా భర్త హత్యకు సర్కారు ఏర్పాట్లు**
**సభలో పరిటాల సునీత ఆరోపణ**
**తన కుమారుడికి ఏ పాపం తెలీదన్న సీఎం**
**సాక్ష్యం చూపాలన్న దివాకరరెడ్డి**
**హత్యోదంతంపై సభలో వాగ్వాదాలు**



హైదరాబాద్ - న్యూస్‌టుడే

తెలుగుదేశం ఎమ్మెల్యే పరిటాల రవి హత్య కేసులో మంత్రి జేసీ దివాకరరెడ్డి, ముఖ్యమంత్రి వైఎస్ తనయుడు జగన్మోహన్‌రెడ్డి ముమ్మాటికీ ముద్దాయిలని తెదేపా ఎమ్మెల్యే పరిటాల సునీత పునరుద్ఘాటించారు. హత్యకు ముందు ప్రభుత్వం పథకం ప్రకారం పలు ఏర్పాట్లు చేసిందన్నారు. ఈ అభియోగాలను ముఖ్యమంత్రి ఖండించారు. తన కుమారుడికి హత్యతో ఎలాంటి సంబంధం లేదన్నారు. జేసీ కూడా తనపై వచ్చిన ఆరోపణలను తోసిపుచ్చారు. ఒక్క సాక్ష్యాన్నైనా చూపాలని సవాల్ చేశారు.

తన భర్త హత్యకు ముందు ప్రభుత్వం చేసిన ఏర్పాట్లే ఇందులో దాని పాత్రను స్పష్టం చేస్తున్నాయని సునీత ఆరోపించారు. హత్యకు కొద్దిరోజుల ముందు సోదాలతో ఆయన్ని వేధించారని, తప్పుడు కేసులు పెట్టారని ఆమె వాపోయారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక 9 నెలల పాటు ప్రతి క్షణం ఆయన ఆందోళనతో గడిపారన్నారు. బుధవారం సభలో సునీత తొలిసారిగా మాట్లాడారు. అంతకుముందు హోంమంత్రి జానారెడ్డి ప్రసంగిస్తూ.. పరిటాలకు 5 ప్లస్ 5 భద్రతను కల్పించింది తమ ప్రభుత్వమేనని, అందువల్ల భద్రత లోపమంటూ లేదని తెలిపారు. మాట్లాడే అవకాశాన్ని తొలుత సునీతకు ఇవ్వకపోవడంతో దేశం సభ్యులు స్పీకరు పోడియాన్ని చుట్టుముట్టి నిరసన వ్యక్తంచేశారు. మాట్లాడే అవకాశం కోసం తాము రెండ్రోజులుగా అనేకసార్లు సభాపతిని అభ్యర్థించిన విషయాన్ని ప్రతిపక్ష నేత చంద్రబాబు గుర్తుచేశారు. అనంతరం ఆమెకు మాట్లాడే అవకాశం ఇచ్చారు. ఆమె జగన్ పేరును ప్రస్తావించినప్పుడు సభలో లేనివారి పేరు చెప్పకూడదంటూ మైకును స్తంభింపజేశారు. మళ్లీ తెదేపా సభ్యులు నిరసన తెలపడంతో ఆమెకు అవకాశం ఇచ్చారు. తన భర్తను ప్రభుత్వమే హత్య చేయించిందంటూ సునీత ధ్వజమెత్తారు. 'నా భర్త అంగరక్షకులుగా ముసలివారిని, చేతకానివారిని ఇచ్చారు. వారికి తుప్పుపట్టిన తుపాకులిచ్చారు. వీరివల్ల తన ప్రాణాలకు రక్షణ ఉండదని నా భర్త భావించబట్టే ప్రైవేటు వ్యక్తులను నియమించుకున్నారు. కాంగ్రెస్ వారి వల్ల తన ప్రాణాలకు హాని ఉందని పసిగట్టి ప్రధానికి కూడా నివేదించుకున్నారు. ఆయన్ను చంపించడం కోసమే ఐజీని, ఎస్పీని సీఎం వేయించుకున్నారు. సీఎం, ఆయన కుమారుడి వల్ల తన ప్రాణాలకు ముప్పుందంటూ పరిటాల స్వయంగా టీవీ ఛానళ్లకు వెల్లడించారు. నా భర్త హత్యకు ముమ్మాటికీ సీఎం, ఈ ప్రభుత్వమే కారణం. పోలీసు అధికారులు ఆయన్ను రోడ్డుమీద నిలబెట్టి సోదాలు చేశారు. సీఎం కుమారుడు కేసువేయగా నా భర్త కోర్టుకు వెళ్తూ ఆయనపై తాను అన్నవాటిని రుజువు చేస్తానని నాకు చెప్పారు. పులివెందులకు 15 వాహనాల్లో వెళ్తుంటే వాటిని అడుగడుగునా తనిఖీ చేశారు. ఇంటికొచ్చి ఆయన ఫైళ్లన్నింటినీ పట్టుకెళ్లిపోయారు. వాటిని ఇప్పటికీ తిరిగివ్వలేదు. పరిటాల హత్య కేసును సీబీఐకి అప్పగించామన్నారు. కాని వారు ఏంచేశారు? దివాకరరెడ్డి, జగన్మోహన్‌రెడ్డి నిందితులంటూ ఫిర్యాదు చేసినప్పుడు వారిని అరెస్టు చేసి విచారించాలి కదా! జగన్‌ను ఎందుకు విచారించలేదు? విచారణ కోసం సీఎం ఇంటికి వెళ్లి చేతులు కట్టుకుని నిలబడి ఏం చేయగలరు? మా ఆయన్ను ముమ్మాటికీ ముఖ్యమంత్రిని అడ్డుపెట్టుకుని చంపించారు' అని ఆమె ఆరోపించారు. చంద్రబాబు మాట్లాడుతూ.. రాజ్యాంగ వ్యవస్థలో ఎంతమంది ఉన్నారో అంతమందికీ పరిటాలను చంపబోతున్నారంటూ చెప్పినా ఫలితం లేకపోయిందంటూ వాపోయారు. 'సభాపతి మొదలుకొని రాష్ట్రపతి వరకు ఫిర్యాదు చేయడంతో పాటు అనంతపురంలో ధర్నాలు చేశాం. ఐజీని అక్కడ వేయొద్దన్నా వేశారు. పరిటాల హత్య ముమ్మాటికీ ప్రభుత్వం చేసిన హత్యే. సీబీఐ అంటే గౌరవం పోయింది. దాన్ని భ్రష్టుపట్టించిన ఘనత కాంగ్రెస్‌కే దక్కింది' అని దుయ్యబట్టారు. చీఫ్ విప్ కిరణ్ కుమార్‌రెడ్డి జోక్యం చేసుకుని జూబ్లీహిల్స్‌లో పరిటాలను హతమార్చేందుకు బాంబులను పేల్చినప్పుడు తామే సభలో ప్రస్తావించామని, హత్యాయత్నం వెనుక చంద్రబాబు హస్తముందంటూ తాను పేర్కొనగా పరిటాల ఆనాటి సభలో మౌనంగా ఉన్నారే తప్ప ఖండించలేదని అన్నారు. అందువల్లే ఆయన హత్యలో తెదేపావారి హస్తం ఉందంటూ తాను సీబీఐకి ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. దీనిని చంద్రబాబు తీవ్రంగా ఖండించారు. నేర చరిత్ర ఎవరికి ఉందో, ఎప్పటి నుంచి ఉందో అందరికీ తెలుసన్నారు. బాంబుపేలుళ్ల దోషులను పట్టుకుని జైళ్లలో పెడితే ఇప్పుడు వారికి జైళ్లు అతిథిగృహాలుగా మారాయని, వారికి అక్కడ సకల సదుపాయాలు సమకూరుతున్నాయని విమర్శించారు. భర్త చనిపోయి ఆడబిడ్డ బాధపడుతుంటే మాపైనే నిందలు మోపుతారా అని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా దోషులను పట్టుకోవాని సూచించారు.

### పరిటాలతో మాకేమీ గట్టు తగాదాలు లేవే: సీఎం

తాను తన తండ్రిని హతమార్చిన వారిపైనే ఎలాంటి ప్రతీకార చర్యలు చేపట్టలేదని, అలాంటప్పుడు కనీసం పొలం గట్టు తగాదా కూడా లేని పరిటాలపై ఎందుకు ప్రతీకారానికి పాల్పడతామని ముఖ్యమంత్రి వైఎస్ ప్రశ్నించారు. ఆయన హత్య వెనుక చంద్రబాబు హస్తం ఉందంటూ కిరణ్‌కుమార్‌రెడ్డి చేసిన ఆరోపణలతో తమకు, ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదన్నారు. విషయాలు తెలిసినవాడిని కనుక అతనిలా తాను ప్రకటించలేనన్నారు. ఆయన రాజకీయంగా చేసిన ప్రకటనని స్పష్టంచేశారు. 'పరిటాలది, మాది వేర్వేరు జిల్లాలు. మా మధ్య ఎటువంటి ఘర్షణలు లేవు. నా కుమారుడు చేసిన తప్పల్లా పెనుకొండ, తాడిపత్రిలకు యువజన కాంగ్రెస్‌వారు పిలిస్తే వెళ్లడమే. అప్పట్లో పరిటాల ఏదో అంటే జగన్ కోర్టులో పరువు నష్టం దావా వేశారు. నా తండ్రిని చంపిన వారు స్వేచ్ఛగా తిరుగుతున్నారు. అసలు వారిని ఏదో చేయాలన్న ఆలోచనలు నాకు రావు. పరిటాల హత్యకు గురైనప్పుడు నేను అనకాపల్లిలో ఉన్నాను. ఆ రోజు సాయంత్రం చంద్రబాబు గవర్నరును కలిసి సీబీఐ విచారణ కోరారు. నా కుమారుడికి ఏ మాత్రం సంబంధం ఉందకునున్నా సీబీఐ విచారణ ఎందుకు వేయిస్తాం? అప్పట్లో రవి, నేను మాట్లాడుకునేవాళ్లం. అలాంటప్పుడు ఎందుకు చంపుకొంటాం? పరిటాలను చంపారంటూ సూరిపై అభియోగం రాగా ఆయన భార్య భానుమతిని పోటీకి పెట్టలేదు. చంద్రబాబు గురించి నాకు బాగా తెలుసు. పాల్ వంటి వారిని ఆయన నాపై ప్రయోగించడమేమిటి? ' అని సీఎం పేర్కొన్నారు.

### ఒక్క సాక్ష్యం చూపించండి: జేసీ

అంతకుముందు మంత్రి జేసీ మాట్లాడుతూ.. పరిటాల హత్య వెనుక ముఖ్యమంత్రి కుమారుడుగానీ, తానుగానీ ఉన్నట్లు ఒక్క సాక్ష్యమైనా ఉంటే చూపించాలని, అప్పుడు శిక్షార్హులమవుతామని అన్నారు. అవేమీ లేకుండా అనుమానాలలో ఆరోపిస్తే తాము చేసేదేమీ ఉండదని చెప్పారు. ప్రత్యక్షసాక్షులెవరూ తమ పేర్లను ఇవ్వలేదని, హత్యను తెదేపావాళ్లు రాజకీయ లబ్ధికి వాడుకుంటున్నారని ఆరోపించారు. తెదేపా ప్రభుత్వం ఉన్నప్పుడే పరిటాలకు భద్రత సిబ్బంది సంఖ్య తగ్గిపోయిందన్నారు. అప్పట్లో ఆయనపై మంచి అభిప్రాయమే ఉంటే ఎక్కువ సిబ్బందిని ఇచ్చుండేవారని చెప్పారు. రవి బాగా ఎదిగిపోతాడనే భావనతోనే ఇలా చేశారన్నారు. ఆయనకు మంత్రి పదవి ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. హత్య జరిగిన రోజు చాలా ఆలస్యంగా చంద్రబాబు సూచనల మేరకే ఎఫ్ఐఆర్‌ను తయారు చేశారని ఆరోపించారు.

### రాజకీయ లబ్ధికే జగన్ పేరు: రఘువీరా

రాజకీయ లబ్ధికే వైఎస్ పేరును, ఆయన కుమారుడి పేరును, జేసీ పేరును పేర్కొంటున్నారని వ్యవసాయ మంత్రి రఘువీరారెడ్డి ఆరోపించారు. అధికారంలో ఉన్నప్పుడు, లేనప్పుడు కూడా పరిటాల రవిని అతని శక్తికి మించి చంద్రబాబు వాడుకున్నారని చెప్పారు. ఆయనకు మంత్రి పదవి ఎందుకివ్వలేదని ప్రశ్నించారు. ఈ సమయంలో తెదేపా సభ్యులు కలగజేసుకొని మీరు పీజేఆర్‌కు మంత్రి పదవి ఎందుకు ఇవ్వలేదని ఎదురు ప్రశ్నించారు.